మహబూబ్‌నగర్
వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట

ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

ఫిర్యాదులు పరిష్కరించని అధికారులకు మెమోలు జారీ : కలెక్టర్

గద్వాల మార్చి 30, ప్రభాతవార్త : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను వెనువెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 81 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డిఓ శ్రీనివాసరావుకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై ఆయా శాఖల వారీగా సంబంధిత అధికారులతో – మిగతా4లో..

మెనూ ప్రకారం భోజనం అందించాలి...!!

వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి

వనపర్తి,మార్చి30 ప్రభాతవార్త : వసతి గృహాలు,సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నిబంధనల ప్రకారం మెనూ అనుసరించి నాణ్యమైన భోజనం పెట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం ఓ పత్రికలో ప్రచురితమైన మెనూ ..మేం పెట్టిందే తిను అనే శీర్షిక పై వచ్చిన ప్రతికూల వార్త పై కలెక్టర్ స్పందించారు. మెనూ ప్రకారం పిల్లలకు భోజనం పెట్టని సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని ఎఒ ను ఆదేశించారు. సంక్షేమ శాఖల అధికారులు హాస్టళ్లు, సంక్షేమ విద్యాలయాలను సందర్శించి మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అనే విషయాల పై ఆరా తీయాలని, మెనూ ప్రకారం భోజనం పెట్టని సిబ్బంది పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అధికారులు క్షేత్రస్థాయిలో హాస్టళ్లు, సంక్షేమ విద్యాలయాలను సందర్శించి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు.

షెడ్యూల్డ్ కులాలకు సబ్సిడీపై ఎలక్ట్రిక్ వాహనాలు

ఏప్రిల్ 8 లోగా దరఖాస్తులు ఆహ్వానం

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్, మార్చి 30, ప్రభాతవార్త : జిల్లా లోని షెడ్యూల్డు కులాలకు చెందిన అభ్యర్థులు స్వయం ఉపాధి అవకాశాలు తద్వారా ఆర్థిక పురోగతి పెంపొందిచాలనే లక్ష్యంతో షెడ్యూల్డు కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం లిమిటెడ్, మహబూబ్ నగర్ జిల్లా "ఎస్.సి. యాక్షన్ ప్లాన్ 202526" క్రింద రూ.1.00 లక్ష రూపాయల వరకు ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనాలు (90 సబ్సిడీ), రూ.3.00 లక్షల విలువ గల త్రిచక్ర ఎలక్ట్రికల్ ఆటో (ప్యాసింజర్/ గూడ్స్) వాహనాలు (70 సబ్సిడీ), రూ.3.00 నుండి రూ.7.00 లక్షల (రూ.5.00 లక్షల వరకు 60 సబ్సిడీ) విలువ గల సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్, వ్యవసాయ అనుబంధ, పశు సంవర్ధక యూనిట్లకై ఆన్లైన్ పోర్టల్‌లో హెచ్‌టిటిపిఎస్://టిజిఓబిఎం ఎంఎస్‌న్యూ.సిజిజి.జిఓవి.ఇన్ ద్వారా ఏప్రిల్ 8వ తేదీలోగా దరఖాస్తులు నమోదుచేసుకోవాలని జిల్లాషెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ చైర్మన్,జిల్లాకలెక్టర్ ఖుష్బూగుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. టూ వీలర్,ఆటో రిక్షాల యూనిట్లకుఅభ్యర్థువయస్సు 2150 సం,, లు కలిగి ఉండాలని, ఉపాధి హామీ పథకాలకు,భూసం బంధ, వ్యవసాయ/ సోలార్ పరికరాలు,21నుండి 60 సం.లు కల అభ్యర్థులు కలిగి ఉండాలని,పశు సంవర్ధక యూనిట్లకు –మిగతా4లో..

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

ఆహార కేంద్రాల్లో తనిఖీలు పెంచాలి

గద్వాల మార్చి 30, ప్రభాతవార్త : జిల్లాలోని హోటల్స్, రెస్టారెంట్స్, తదితర ఆహార కేంద్రాల్లో సంబంధిత అధికారులు ఆహార పదార్థాలు మంచిగా ఉన్నాయో,లేదో తరచూ తనిఖీలు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. సోమవారం ఐడిఓసీ సమావేశపు మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఆహార సలహా కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. గ్రామస్థాయిలో ఉండే హోటల్స్ సైతం సంబంధిత గ్రామపంచాయతీ, ఫుడ్ సేఫ్టీ విభాగం నుంచి హోటల్స్ నిర్వహించేందుకు అనుమతులు తీసుకోవడం, రిజిస్ట్రేషన్ చేసుకోవడం తప్పనిసరి చేయాలన్నారు. జిల్లాలోని హోటల్స్‌లో ఆహారాన్ని తయారు చేసేందుకు వినియోగించే నూనెలు, ఇతర సరుకులు నాణ్యతతో ఉన్నాయో లేదో సంబంధిత అధికారులు తరచు పరిశీలించాలన్నారు. ఆహార కేంద్రాల వంట గదులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. అక్కడ వినియోగించే పాత్రలు, నీళ్లు శుభ్రంగా లేకుంటే ఆహారం కల్తీ అయ్యే ప్రమాదం ఉన్నందున సంబంధిత అధికారులు తరచూ పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. వంట చేసే మాస్టర్లు, ఇతర సిబ్బంది నిబంధనల ప్రకారం జాగ్రత్తలు పాటిస్తూ శుచి, శుభ్రతతో వంటలు చేసేలా ఆదేశించాలన్నారు. ఒక నెలలో హోటల్స్ నుంచి సేకరించిన ఆహార పదార్థాల శాంపిల్స్ ను ల్యాబ్ కు పంపించి రిపోర్టును ఎప్పటికప్పుడు తమకు పంపించాలన్నారు. హోటల్ ల యజమానులు నిబంధనల ప్రకారం ఆయా ఆహార కేంద్రాలను నిర్వహించాలని, కల్తీ ఆహార పదార్థాలను విక్రయించే యాజమాన్యాలపై కేసులు బుక్ చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఈ సందర్భంగా ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు,ఆర్డీవో శ్రీనివాసరావు, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 30, ప్రభాతవార్త: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ మీటింగ్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 167 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్‌తో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ – మిగతా2లో..

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుష్బూ గుప్తా

యువత భవిష్యత్తు

కాపాడుదాం

- మాదకద్రవ్యాల నిర్మూలనపై చైతన్యం తేవాలి
- జిల్లా యంత్రాంగం భారీ అవగాహన యజ్ఞం
- సురక్షిత యువత - శక్తివంతమైన రాష్ట్రం, డ్రగ్స్ నిర్మూలనకు అవగాహన కార్యక్రమం
- చెడును దూరం పెట్టి మంచిని అలవాటు చేసుకోండి
- జిల్లా కలెక్టర్, ఎస్.పిల నేతృత్వంలో 2000 మంది విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన యజ్ఞం
- డ్రగ్స్‌తో ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం : ఎస్పీ జానకి ధరావత్

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ కుష్బూ గుప్త

మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 30 ప్రభాతవార్త: ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్య క్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం సోమవారం బృందావన్ గార్డెన్‌లో మహబూబ్‌నగర్ రూరల్, పోలీసు స్టేషన్ పరిధి మహబూబ్‌నగర్ పట్టణం లోని విద్యార్థుల భద్రత దృష్ట్యా మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని జిల్లా ఎస్.పి జానకి ఆధ్వర్యంలో సుమారు 2000 మంది విద్యార్థులతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ప్రమాదకర వ్యసనమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాదకద్రవ్యాల నిర్మూలనకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటూ, ప్రత్యేకంగా ఈగల్ " ఫోర్స్ బృందాన్ని బలోపేతం చేసినట్లు తెలిపారు.విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, కుటుంబ సభ్యులతో సాన్నిహిత్యం పెంచుకోవడం, మంచి స్నేహితులతో కలసి క్రీడలు మరియు సానుకూల కార్యకలాపాల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరుచుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి మార్పు సాధిస్తే సమాజం, రాష్ట్రం, దేశం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని అన్నారు.జిల్లా ఎస్పీ జానకి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. ఈ వ్యసనానికి లోనైతే వ్యక్తిగత జీవితం, కుటుంబ జీవితం రెండూ దెబ్బతింటాయని హెచ్చరించారు.ఒకవేళ ఎవరైనా ఈ అలవాటుకు గురైతే, భయపడకుండా కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులను సంప్రదించి బయటపడాలని సూచించారు. యువత తమ లక్ష్యాల పై దృష్టి పెట్టి మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు, మాదకద్రవ్యాలు అమ్మిన, వాడిన , రవాణా చేసిన వారిపై చట్టరీత్యా శిక్షలు తీసుకోబడును. అలాగే వీరికి ప్రభుత్వం తరపున రావలసిన ఎలాంటి రాయితీలు కూడా రావని తెలిపారు.ఈగల్ ఫోర్స్ అదనపు ఎస్.పి.కృష్ణమూర్తి మాట్లాడుతూ, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయ విధానాలు , వాటి వెనుక ఉన్న నెట్వర్క్ గురించి వివరించారు. ఈ సందర్భంగా పిపిటి ప్రెజెంటేషన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు.మాదకద్రవ్యాల వ్యాపారాన్ని అరికట్టడంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని, అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం –మిగతా4లో..

పోస్టరును ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ జానకి జిల్లా అధికారులు

ఉదండాపూర్ నిర్వాసితులకు

మరో రూ.150కోట్లు

- ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద విడుదల చేసిన ప్రభుత్వం
- రూ.400 కోట్లకు చేరిన ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ నిధుల చెల్లింపు మొత్తం
- సీఎం రేవంత్, మంత్రులు ఉత్తమ్, భట్టికి ధన్యవాదాలు తెలిపిన అనిరుధ్ రెడ్డి
- మిగిలిన మొత్తాన్నీ ఏప్రిల్‌లో తీసుకురావడానికి కృషి చేస్తానన్న ఎమ్మెల్యే

జలసౌధలో ఉదండాపూర్ ప్రాజెక్టుపై జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి (ఫైల్)

జడ్చర్ల, మార్చి 30, ప్రభాతవార్త: ఉదండాపూర్ ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ కింద ప్రభుత్వం మరో రూ.150 కోట్లను విడుదల చేసిందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి వెల్లడించారు. దీంతో ఇప్పటి వరకూ ఉదండాపూర్ నిర్వాసితులకు ప్రభుత్వం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద విడుదల చేసిన మొత్తం రూ.400 కోట్లకు చేరిందని తెలిపారు. ఉదండాపూర్ నిర్వాసితులకు చెల్లించాల్సిన మిగిలిన బకాయి మొత్తాన్ని ఏప్రిల్‌నెలలో ప్రభుత్వం నుంచి తీసుకు రావడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.హైదరాబాద్‌లోని జలసౌధలో ఈనెల 8న పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌పై జరిగిన అధికారిక సమీక్షా సమావేశంలో ఉదండాపూర్ నిర్వాసితులకు చెల్లించాల్సిన బకాయిల విషయం గురించి చర్చించిన విషయాన్ని సోమవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో అనిరుధ్ రెడ్డి గుర్తు చేసారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో భాగంగా ఉదండాపూర్ నిర్వాసితులకు ఇచ్చే పరిహారాన్ని రూ.18లక్షలకు పెంచడం, ఈ కారణంగా నిర్వాసితులకు అదనంగా రూ.146 కోట్ల రూపాయల మొత్తాన్ని చెల్లించడానికి ప్రభుత్వం గతంలోనే అంగీకరించిందని, పెంచిన ఈ పరిహారంతో కలిసి ప్రస్తుతం ఉదండాపూర్ నిర్వాసితులకు ఇంకా రూ.338 కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉందని చెప్పారు. ఈ మొత్తాన్ని రెండు నెలల్లో నిర్వాసితులకు అందజేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ కూడా ఇచ్చారని తెలిపారు. రెండు నెలల్లోపుగా ఉదండాపూర్ నిర్వాసితులకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగానే మార్చి నెలలో విడుదల చేయాల్సిన రూ.150 కోట్లను ప్రస్తుతం విడుదల చేసిందని వెల్లడించారు. నిర్వాసితులకు చెల్లించాల్సిన మిగిలిన బకాయి మొత్తాన్ని కూడా ఏప్రిల్ నెలలో తీసుకురావడానికి తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారంగా ప్రస్తుతం ఉదండాపూర్ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద రూ.150 కోట్లు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆర్థికశాఖా మంత్రి భట్టి విక్రమార్కలకు అనిరుధ్ రెడ్డి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉదండాపూర్ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఒక్క రుపాయి కూడా చెల్లించకుండా నిర్వాసితులను రోడ్లపాలు చేసారని విమర్శించారు. రాష్ట్రంలో తమ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గడచిన ఏడాది కాలంలోనే ఇప్పటి వరకూ రూ.250 కోట్లను విడుదల చేసారని, ప్రస్తుతం విడుదల చేసిన రూ.150 కోట్లతో కలిపి ఈ మొత్తం ఇప్పుడు రూ.400 కోట్లకు చేరిందని అనిరుధ్ రెడ్డి – మిగతా4లో..

శ్రీశైలం భూగర్భ జల విద్యుత్ కేంద్రం

రికార్డు బ్రేక్..

- శ్రీశైలం ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రంలో రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి
- 2025,26 సంవత్సరానికి 2590.09 మి.యూ. ఉత్పత్తి
- హర్షం వ్యక్తం చేసిన ఈగలపెంట జెన్‌కో సీఈ కేవి సత్యనారాయణ

మహబూబ్‌నగర్ బ్యూరో,మార్చి 30 ప్రభాతవార్త : నాగర్‌కర్నూల్ జిల్లాలోని దోమల పెంట ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి జరిగింది. 2008లో జరిగిన విద్యుత్ ఉత్పత్తి రికార్డ్స్ ను బ్రేక్ చేసింది. 2025,26 ఏడాదికి గాను రికార్డ్ స్థాయిలో 2590.09 మి.యూ. ఉత్పత్తి జరిగినట్లు అధికారులు చెబుతున్నారు.

రెండున్నర దశాబ్దాలుగా విద్యుదుత్పత్తి..

శ్రీశైలం ఎడమ గట్టు జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం 2001 సంవత్సరంలో ప్రారంభమైనది. జపాన్ సాంకేతిక పరిజ్ఞానంతో ఆరు యూనిట్లలో 150 మెగా వాట్‌ల విద్యుత్ ఉత్పత్తి చేసే సామర్థంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా శ్రీకారం చుట్టారు. దాదాపు రెండున్నర దశాబ్దాలుగా నిరంతరంగా విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది. 200708 సంవత్సరంలో – మిగతా4లో..

ఏసీబీ వలలో

తిమ్మాజిపేట ఎస్ఐ

- 25 వేల లంచం తీసుకుంటూ.. ఏసీబీకి పట్టుబడిన ఎస్ఐ
- అక్రమ ఇసుక రవాణా దారులతో లంచం డిమాండ్

ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 30 ప్రభాతవార్త: అక్రమంగా ఇసుకను తరలిస్తూ పట్టుకున్న వాహనాలను వదిలిపెట్టడానికి లంచం డిమాండ్ చేసిన తిమ్మాజీపేట ఎస్ఐ అవినీతి నిరోధక శాఖ అధికారుల వలలో చిక్కాడు. వివరాల్లోకి వెళితే... అక్రమంగా తరలిస్తున్న ఇసుక వాహనాలను పట్టుకొని మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసిన తిమ్మాజీపేట ఎస్ఐ అట్టి వాహనాలను వదిలిపెట్టడానికి లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో సోమవారం ఏసీబీ అధికారులు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఒక కేసుకు సంబంధించి ఈనెల 7వ తేదీన ఒక వ్యక్తి నుండి రూ.30 వేలు డిమాండ్ చేసి రూ.20వేలు లంచం తీసుకున్న ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డిని మహబూబ్‌నగర్ ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ ఆధ్వర్యంలో దాడులు చేసి అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించి ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తికి సంబంధించిన ట్రాక్టర్, జెసిబి ని పట్టుకొని ఈనెల 5న ఎస్ఐ హరి ప్రసాద్‌రెడ్డి కేసు నమోదుచేసి నాగర్‌కర్నూల్ జిల్లా మైనింగ్ అధికారులకు సమాచారం – మిగతా4లో..

మక్తల్ అంబేద్కర్ చౌక్‌లో రాస్తారోకో

- 167 జాతీయ రహదారి నేషనల్ హైవేపై ఆశా వర్కర్లు
- ప్రజాస్వామ్య పరిరక్షణ హామీ ఏమైంది సిఐటియు జిల్లాఅధ్యక్షులు గోవింద్ రాజ్

మక్తల్ లో ఆశా వర్కర్ల ధర్నా రోడ్డు బిగ్బంధం

మక్తల్ టౌన్,మార్చి 30 ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలతోపాటు,7వ హామీగా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తామని హామీ ఇచ్చిందని, కానీ ప్రజాస్వామ్య పరిరక్షణలో దారుణంగా విఫలమైందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సిఆర్ గోవింద్ రాజ్ అన్నారు. ఛలో హైదరాబాద్ సందర్భంగా హైదరాబాద్‌కు వెళ్లిన ఆశా కార్యకర్తలపై లాఠీ ఛార్జ్ చేయడాన్ని నిరసిస్తూ సోమవారం మక్తల్ పట్టణ కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారో నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆశా కార్యకర్తలకు 18వేల రూపాయల ఫిక్స్డ్ వేతనం ఇస్తామని హామీ ఇచ్చిందని హామీలు అమలు చేయమని ప్రశ్నిస్తే ఆశాకార్యకర్తలపై అత్యంత నిరంకుశంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు.లాఠీచార్జ్ చేయడమే కాకుండా రాత్రి వరకు ఆడప డుచులను పోలీస్‌స్టేషన్లో పెట్టి నిర్బంధించిందని విమర్శించారు. కార్మిక వర్గ పోరాటాల పట్ల బాధ్యతరాహితంగా వ్యవహరించిన ఏ ప్రభుత్వము మనుగడ సాధించిన దాఖలాలు లేవన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాలమణి కార్యదర్శి పుంజ నూరు ఆంజనేయులు, సిఐటియు మాజీ జిల్లా ఉపాధ్యక్షులు భరత్,సిఐటియు జిల్లాకమిటీ సభ్యులు మాట్లాడుతూ అక్రమంగా అరెస్టులు చేయడమే కాకుండా మంచి నీళ్లు కూడా ఇవ్వకుండా పోలీస్‌స్టేషన్లను నిర్బంధిం చారని విమర్శించారు. తమ ను విస్మరించి తమ పోరాటాలను అణచివేసిన గత ప్రభుత్వానికి ఏగతి పట్టిందో గుర్తెరగాలని హెచ్చరించారు.తమకు ఫిక్స్డ్ వేతనం రూ. 18000 ఇచ్చేంతవరకు అదనపు పని భారాలు తగ్గించాలని, మట్టి ఖర్చులకు రూ.50,000, ఇన్సూరెన్స్ రూ. 50 లక్షల చెల్లించేంతవరకు తమ పోరాటం ఆగిబోదని తక్షణమే ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలలో ఆశాలకు ప్రత్యేక నిధుల కేటాయించాలని డిమాండ్ చేశారు. మక్తల్ సీఐ రాంలాల్, ఎస్ఐలు రేవతి భాగ్యలక్ష్మి రెడ్డి, ఎస్ఐ చారి, రాస్తారోకో చేస్తున్న యూనియన్ నాయకులతో, ఆశా కార్యకర్తలతో మాట్లాడి రాస్తారోకోను విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు గోవిందమ్మ, గౌరమ్మ, యశోద, అమీనా బేగం, ఇందిరా, అనురాధ, సుజాత, లక్ష్మి, నర్సింగమ్మ, వెంకటలక్ష్మి, పార్వతమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

జనగణను సమర్థవంతంగా నిర్వర్తించాలి...

- క్షేత్రస్థాయిలో శిక్షణ తరగతులను సమర్థంగా నిర్వర్తించండి
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

నాగర్‌కర్నూల్ ప్రతినిధి,మార్చి30 ప్రభాతవార్త: జిల్లాలో నిర్వహించే జనగణన విధులను సక్రమంగా నిర్వహించాలని, ప్రక్రియ నిర్వహణ, సాంకేతికత వినియోగంపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి యాప్ ద్వారా జనగణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వర్తించాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. సోమవారం జనగణన 2027 ఫేస్ - 1 గృహాల జాబితా, గృహ గణన నిర్వహణలో భాగంగా, సెన్సెస్ ఫీల్డ్ ట్రైనర్స్‌కు హైదరాబాదు నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్లు ఫీల్డ్ ట్రైనర్లకు డిజిటల్ శిక్షణ కార్యక్రమాన్ని రాష్ట్ర జనగణన డైరెక్టర్ భారతి హోళికేరి,జిల్లాల కలెక్టర్లు శిక్షణ కార్యక్రమంలో అధికారులతో కలిసి పాల్గొన్నారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో జనగణన నాణ్యత క్షేత్రస్థాయి కార్యకర్తలపైనే ఆధారపడి ఉంటుందని వారికి సమర్థవంతంగా శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ ఫీల్డ్ శిక్షణ బృందాలను కోరారు. క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ ఇచ్చే బాధ్యత వారిపైనే ఉంటుంది కాబట్టి, శిక్షణా మాడ్యూల్ ను సమర్థవంతంగా అర్థం చేసుకోవాలని జనాభా గణన ప్రక్రియ సమయంలో వారు సజావైన సమన్వయాన్ని కూడా పాటించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని 20 మండలాల ప్రణాళిక గణాంక అధికారులు చార్జ్ క్లర్క్, అసిస్టెంట్ ఛార్జ్ క్లర్క్‌లుగా, కంప్యూటర్ ఆపరేటర్లు సాంకేతిక సహాయకులుగా తమకు నిర్దేశించిన విధులను సమర్థవంతంగా నిర్వహించేలా శిక్షణ తరగతులను అందించాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్డులు, పట్టణ ప్రాంతాల్లో ప్రతి కాలనీ, అపార్ట్మెంట్లు, చిన్నచిన్న వీధి ప్రాంతాల్లో నివసించే ప్రతి ఇంటిని ఇంటిలోని ప్రతి ఒకరి జనగణన విధిగా నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని మారుమూల గిరిజన తండాలు, ఆవాస ప్రాంతాలు హ్యాబిటేషన్లు, గ్రామాలు, మండలాలు, పట్టణ ప్రాంతాలు, జిల్లా స్థాయి వరకు జనగణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వర్తించేలా కచ్చితంగా అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ తెలిపారు. అంతకుముందు నాగర్ కర్నూల్ జిల్లా సమీకృత కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ హాల్‌లో శిక్షణా కార్యక్రమంలో డిజిటల్ విధానం సాంకేతిక సమస్యలు తదితర అంశాలపై సవివరంగా వివరించారు. జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిని సుజాత, మాస్టర్ ట్రైనర్ విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ మాదకద్రవ్యాలపై అవగాహన

నవాబుపేట, మార్చి 30 ప్రభాతవార్త : నవాబుపేట పోలీస్ శాఖ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్, గంజాయి మదకద్రవ్యాలపై నవాబుపేట పోలీస్ అధికారులు ఎక్సైజ్ అధికారులు నవాబుపేట, సోమవారం యన్మన్ గండ్ల, చౌడూర్, కొల్లూరు గ్రామాలలో గంజాయి డ్రగ్స్ మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సదస్సులలో డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలు, వాటి నుంచి ఎలా దూరంగా ఉండాలో అనే వివరాలను తెలియజేయడం జరుగగింది. ఈ సందర్భంగా ఎస్సై విక్రం, ఎక్సైజ్ అధికారి కరుణ మాట్లాడు తూ, చెడు వ్యసనాలపై యువత చిన్న వయస్సులో చెడు వ్యసనాలకు బానిసలు ఐతే కుటుంబ ము, జీవితం నాశనం అవుతుందని ఆమె అన్నారు. గంజాయి,డ్రగ్స్ రూపుమాపాలంటే కేవలం పోలీస్ బాధ్యతనే కాదు సమాజం బాధ్యత కూడా ఉండాలని అన్నారు. యువత ఎవరైనా డ్రగ్స్ గంజాయి వాడుతునట్లు తెలిస్తే టోల్ ఫ్రీ నంబర్ 1908 కి సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నవాబుపేట ఎస్సై విక్రమ్,అబ్కారీ ఎస్సై కరుణ, మెడికల్ ఆఫీసర్ శ్రవణ్ కుమార్ మార్కెట్ కమిటీ చైర్మన్ హరలింగం, వైస్ చైర్మన్ తులసి రామ్ నాయక్, కొల్లూరు సర్పంచ్ సేవియా నాయక్, చందర్ నాయక్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బ్రహ్మోత్సవాలు విజయవంతం

ప్రతి ఒక్కరికి అభినందనలు సర్పంచు చింత గాళ్ళ శ్రీనివాసులు

ఉప్పునుంతల,మార్చి 30 ప్రభాతవార్త : మండల కేంద్రమైన ఉప్పునుంతల శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామంలో జరిగిన బ్రహ్మోత్సవాలకు సహకరించిన ప్రతి ఒక్కరికి గ్రామ సర్పంచు చింత గాళ్ళ శ్రీనివాసులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. శ్రీ కేదారేశ్వర ఆలయం, తేరు ఉత్సాహ కమిటి ఆధ్వర్యంలో సీతా రాముల కళ్యాణం, రథోత్సవం (తేరు) కార్యక్రమం, కోలాటం,భజన,చిడుతల భజన, ట్రాక్టర్స్ పోటీలు, బైక్ స్లో పోటిలు, అంతరాష్ట్ర వృషభ రాజుల చే బండలాగుడు తదితర పోటీలు విజయ వంతం చేయడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉప్పునుంతల ఎస్సై వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు, మూడు రోజుల పాటు అందుబాటులో ఉండి సేవలు అందించడమే కాకుండా అందరినీ కలుపుకుని మనసు గల వ్యక్తి ఎస్సై వెంకట్ రెడ్డి అని సర్పంచు శ్రీనివాసులు అన్నారు. ముఖ్యంగా పోలీసులకు, గ్రామపంచాయతీ సిబ్బందికి, అన్ని వర్గాల ప్రజలకు గ్రామ సర్పంచ్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

పిల్లల భద్రత, డ్రగ్స్‌కు అడ్డుకట్టపై అవగాహన

మిడ్జిల్, మార్చి 30 ప్రభాతవార్త : పిల్లల భద్రత దక్షకు అడ్డుకట్టపై మండల కేంద్రంలో ఎంవిఎస్ ఫంక్షన్ హాల్ లో సోమవారం డిఎస్పి వెంకటేశ్వర్ల ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు సోమవారం భద్రత డ్రగ్స్ గురించి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఎస్పి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల యువత, విద్యార్థిని విద్యార్థులు చేరిపోతున్నారని భావితరంలో మీరు మారదర్శంగా ఉండాలని గొప్ప చదువులు చదువుకొని తల్లిదండ్రులకు సమాజానికి మంచి గుర్తింపును తేవాలని తెలిపారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల మీ ఆరోగ్యం పరిస్థితిలో మెదడుకు వ్యవస్థ అవయవాలు పాడైపోతాయని వీటి వలన మీరు అనుకున్న లక్ష్యాన్ని సాధించలేక పోతారని మీ జీవితం అర్థార్థంగా ముగిసిపోతుందని మత్తు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సమాజంలో గొప్ప స్థాయిని పెంచుకోవాలని తెలిపారు. ఎవరైనా డ్రగ్స్ అమ్మిన డ్రగ్స్ తీసుకున్న నేరంగా భావిస్తానని తెలిపారు మీ భద్రత కోసం పోలీసులు ఎప్పుడూ అందుబాటులో ఉంటారని మీ ఆత్మ రక్షణ కోసము 1908 డయల్ చేసి పోలీసులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ జ్యోతి అల్వాల్ రెడ్డి, గ్రామ సర్పంచ్ ఎడ్ల శంకర్, తహసిల్దార్ స్వప్న, ఎంపీడీవో గీతాంజలి, మండల విద్యాధికారి ఎండి మిర్జాలి, ఎంపీ ఓ రాజశేఖర్, సూపర్‌వైజర్ వెంకటేష్, సంపత్ కుమార్, ఉపసర్పంచి మమత, మన్యం, వార్డు మెంబర్స్, విద్యార్థిని, విద్యార్థులు, టీచర్లు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

గ్రామసభల్లో అన్ని శాఖల ప్రగతి వివరాలు ప్రస్తావించాలి

గద్వాల మార్చి 30, ప్రభాతవార్త: ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2న గ్రామసభలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అన్ని శాఖల్లోని అభివృద్ధి కార్యక్రమాల పూర్తి వివరాలను గ్రామసభల్లో ప్రస్తావించాలన్నారు. గృహజ్యోతి, మహాలక్ష్మి, రైతు భరోసా, తదితర పథకాల గ్రామస్థాయి వివరాలను సేకరించి ఆయా గ్రామసభల్లో ప్రజలకు తెలియజేయాలన్నారు. మండలాల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్ లు తరచూ తమ పరిధిలోని పాఠశాలలను, వసతి గృహాలను సందర్శించాలని, ప్రతి శుక్రవారం అక్కడే భోజనం చేయాలని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు సైతం సంబంధిత అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేస్తున్నారని చెప్పారు. 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైల్స్ క్లియరెన్స్, పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ క్షేత్రస్థాయిలో తాను ఇటీవల పలు మండలాల్లో పర్యటించి పరిశీలించగా చాలా కార్యాలయాల్లో పాత సామాన్లు అలాగే ఉన్నాయని, సంబంధిత అధికారులు ఆదేశాలు పాటించకపోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా అధికార యంత్రాంగం పనితీరులో చాలా మార్పు రావాల్సి ఉందని, నిర్లిప్తంగా వ్యవహరించే వారిపై తగు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు,ఆర్డీవో శ్రీనివాసరావు, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

డైల్ యువర్ డీఎం కార్యక్రమం ప్రజలకు అవకాశం

నారాయణపేట, మార్చి 30 ప్రభాతవార్త : నారాయణపేట పట్టణం, కోస్గి పరిసర ప్రాంతాల ప్రజలకు డిపో మేనేజర్ లావణ్య ముఖ్య సమాచారం అందించారు. నేడు మంగళవారం ఉదయం 11.00 గంటల నుండి 12.00 గంటల వరకు డైల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రయాణికులు తమ సమస్యలు, సలహాలు, సూచనలను నేరుగా అధికారులకు తెలియజేసుకునే అవకాశం కల్పించబడింది. ప్రజలు 73 82 82 62 93 ఫోన్ నంబర్‌కు కాల్ చేసి తమ సమస్యలను తెలియజేయవచ్చని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రవాణా సంబంధిత ఇబ్బందులు సేవల మెరుగుదలపై తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి సహకారం అందుతుందని తెలిపారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం అవగాహన ర్యాలీ

నారాయణపేట, మార్చి 30 ప్రభాతవార్త : నారాయణపేట జిల్లా కేంద్రంలో ఇంటర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులతో కలిసి భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిట్టెం నర్సి రెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాల నుండి మెట్రో గార్డెన్ ఫంక్షన్ హాల్ వరకు ఈర్యాలీ కొనసాగింది. డ్రగ్స్ గంజాయి వంటి మత్తు పదార్థాల నుండి సమాజాన్ని రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్,జిల్లా ఎస్పీ డా.వినీత్ తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి యాంటీ డ్రగ్ సోల్జర్స్‌గా మారాలని పిలుపునిచ్చారు. అనంతరం 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా మాదకద్రవ్యాల నివారణపై కార్యక్రమం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి పౌరుడి పాత్ర కీలకమని పేర్కొన్నారు యువత తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చే విధంగా ముందుకు సాగాలని కోరారు. ఎస్పీ డా.వినీత్ మాట్లాడుతూ డ్రగ్స్ దేశ భవిష్యత్తుకు ముప్పుగా మారుతున్నాయని హెచ్చరించారు. యువతను బలహీనపరచడానికి డ్రగ్స్‌ను ఆయుధంగా ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఎవరైనా మత్తు పదార్థాల అక్రమ రవాణా విక్రయం గమనించినట్లయితే 1908 లేదా 100 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఈగల్స్ ఫోర్స్ డీఎస్పీ పుష్పన్ కుమార్, డీఎస్పీ నల్లపు లింగయ్య, డీఎంహెచ్ఓ జయచంద్రమోహన్, ఆర్టీఓ మెగాగాంధీ, ఎక్సైజ్ సీఐ అనంతయ్య, ఎస్ఐలు, ఉపాధ్యాయులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ఎండ తీవ్రతలకు జాగ్రత్తలు పాటించాలి

గద్వాల మార్చి 30, ప్రభాతవార్త: జిల్లాలో ఎండ తీవ్రతలు 40 డిగ్రీలు ఉన్నందున వడదెబ్బకు గురి కాకుండా అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎండల తీవ్రతపై వైద్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఎక్కడ కూడా ఏ ఒక్కరు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని, ఇందులో భాగంగా మండలాలలోని అన్ని ఎంపీడీవోలు, తహసీల్దార్ కార్యాలయాలు, గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాల విద్యార్థులు అంగన్వాడి చిన్నారులకు వడదెబ్బ తగలకుండా అన్ని జాగ్రత్తలు చర్యలు చేపట్టాలని, పాఠశాల విద్యార్థులకు ఇప్పటికే సగం రోజు పాఠశాలలను నిర్వహించడం జరుగుతుందన్నారు. వసతిగృహాలలో ఉండే విద్యార్థులు ఎండ పూట బయటకు వెళ్లకుండా ఉపాధ్యాయులు తగు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. జిల్లా అధికారులు కూడా వడదెబ్బకు గురికాకుండా టోపీలను వినియోగించాలని, తరచుగా నీరు సేవించాలని అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ కూలీలు కూడా మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు నిర్వహించాలని అన్నారు. వైద్యాధికారులు అన్ని గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీలకు వీళిళీ ప్యాకెట్‌లు పంపిణిచేయాలన్నారు. పక్షులు, పశువులకుకూడా నీటిని అందించేలా ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం వేళల్లో బయటకు వెళ్ల కూడదని, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. తరచుగా తాగునీరు, మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరినీళ్లు, లేదా ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై ముద్రించిన గోడ పత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మీ నారాయణ, నర్సింగరావు, జిల్లా వైద్యాధికారి సంధ్య కిరణ్మయి, ఆర్డిఓ శ్రీనివాసరావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గోడ పత్రికను విడుదల చేస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

డబ్బాల యజమానులకు అభయమిచ్చిన రాష్ట్ర మంత్రి

ఆత్మకూర్ మార్చి30, ప్రభాతవార్త : మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని గాంధీ చౌరస్తా నుండి పెట్రోల్ బంక్ వరకు అక్రమంగా వెలిసినటువంటి డబ్బాల తొలగింపుకు ఆత్మకూరు మున్సిపల్ పాలకవర్గం చర్యలు చేపట్టడంతో డబ్బాల యజమానులు తమకు న్యాయం చేయాలంటూ సోమవారం రోజు మక్తల్ నియోజకవర్గం శాసనసభ్యులు రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరిని హైదరాబాదులోని మంత్రి నివాసంలో కలిసి తమ గోడు వెల్లబోసుకోవడంతో డబ్బాల యజమానులకు మంత్రి వాకిటి శ్రీహరి అభయం ఇచ్చినట్లుగా డబ్బాల యజమానులు విలేకరులకు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో ఆత్మకూరు నుండి అమరచింతవైపుకు వెళ్లే ప్రధాన రహదారిలో డబ్బాలు వేసుకొని చిరు వ్యాపారాలు కొనసాగిస్తున్న యజమానులు తమ డబ్బాలను తొలగించాలంటూ గడచిన 15 రోజుల కిందట ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ మరియు పాలకవర్గం నోటీసులు అందజేయడంతో దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఒక్కసారిగా గతవారం మున్సిపల్ పాలకవర్గం డబ్బాలను తొలగించేందుకు ప్రత్యక్ష చర్యలకు పాల్పడంతో డబ్బాల యజమానులు వేడుకున్నప్పటికీ తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా సోమవారం వరకు డబ్బాల యజమానులు తమ వ్యాపారాలు తరలించుకునేందుకు సమయం ఇస్తున్నామని మున్సిపల్ కమిషనర్ మరియు మున్సిపల్ పాలకవర్గం హెచ్చరిక జారీ చేయడంతో వ్యతిరేని పరిస్థితిలో డబ్బాల యజమానులు రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరిని కలిసి ఆత్మకూరు నుండి అమరచింతకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టిన వెంటనే తమ డబ్బాలను స్వచ్ఛందంగా తొలగించుకునేందుకు తాము లిఖితపూర్వకంగా ఒప్పుకుంటామని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరికి తెలియజేయడంతో పనులు ప్రారంభించేవరకు డబ్బాల నిర్వాహకుల వ్యాపారాలు చేసుకోవాల్సిందిగా మంత్రి అభయమిచ్చినట్లుగా డబ్బాల యజమానులు విలేకరులకు తెలిపారు. ఇదిలా ఉండగా రాజకీయ కక్షల నేపథ్యంలోనే వ్యాపారాలు కొనసాగిస్తున్న తమపై మున్సిపల్ పాలకవర్గం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందంటూ టిఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు గతవారం డబ్బాలను తొలగిస్తున్న సందర్భంలో మున్సిపల్ పాలకవర్గంతో ప్రత్యక్ష ఘర్షణలకు దిగడం విశేషం.

మంత్రిని కలిసి వినతిపత్రం అందజేస్తున్న డబ్బాల యజమానులు

లేబర్ కోడ్లు రద్దు చేయాలంటూ టియుసిఐ నిరసన

ఆత్మకూరు మార్చి28, ప్రభాతవార్త : దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 1 నుండి అమలులోకి తేనున్న నాలుగు లేబర్ కోర్టులను తక్షణమే రద్దు చేయాలంటూ టియుసిఐ ఆధ్వర్యంలో సోమవారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని గాంధీ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టడంతోపాటుగా నాలుగు లేబర్ కోడ్ల ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా టియుసిఐ జిల్లా అధ్యక్షులు ప్రసాద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మికులు నిరంతర పోరాటాలు నిర్వహించి 44 కార్మిక కోడ్లను సాధించుకున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మాత్రం కార్పొరేట్ వర్గాలకు పెద్దపీట వేస్తూ దేశవ్యాప్తంగా కార్మికుల పాలిట మరణ శాసనంగా నాలుగు లేబర్ కోడ్లను అమలులోకి తేవడం ఎంతవరకు సమంజసమని ఆయన తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. గత సంవత్సర కాలంగా దేశవ్యాప్తంగా నాలుగు లేబర్ కోడ్ల ను రద్దు చేయాలంటూ ప్రత్యక్షంగా 25 కోట్ల మంది కార్మికులు గలమెత్తి నిరసనలు ప్రకటిస్తున్నప్పటికీ నరేంద్ర మోడీ ప్రభుత్వం మాత్రం కార్పొరేట్ వర్గాలకు కొమ్ముకాస్తూ కార్మిక హక్కులను కాలరాస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తేనున్న నాలుగు లేబర్ కోడ్ల ద్వారా భవిష్యత్తులో కార్మికులు మరియు రైతులు దేశవ్యాప్తంగా ఎలాంటి సమ్మె నోటీసులు కానీ, హక్కులు పొందేందుకు గాని ఎలాంటి వీలు లేకుండా పోతుందని తద్వారా కార్మికుల జీవన ప్రమాణాలు దెబ్బతీయడమే కాకుండా ఉద్యోగ భద్రత కరువైపోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని లేని పక్షంలో దేశవ్యాప్తంగా కార్మికులు ప్రత్యక్ష పోరాటాలకు పూనుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మున్సిపల్ కార్మికులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయా గ్రామాల్లోని గ్రామపంచాయతీ కార్మికులు తదితరులతోపాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

లేబర్ కోడ్లు రద్దు చేయాలంటూ నిరసన నిర్వహిస్తున్న దృశ్యం

మత్తు పదార్థాలతో జీవితం చిత్తు

గంజాయి, కల్తీ కల్లు వంటి మత్తు పదార్థాలకు బానిసలు కాకండి : ఈగల్ టీం సీఐ ప్రసాద్

బాలానగర్, మార్చి 30 ప్రభాతవార్త : బాలానగర్ మండలంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం హైదరాబాద్ ఈగల్ టీం సిఐ ప్రసాద్ ఉడిత్యాల, మోతీ ఘనపూర్, కేతిరెడ్డిపల్లి, బాలానగర్ గ్రామాలలో ఈగల్ ఫోర్స్ తెలంగాణ డ్రగ్స్ అవేర్ నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మత్తు పదార్థాలతో జీవితాన్ని చిత్తు చేసుకోవద్దని, గంజాయి, కల్తీ కళ్ళు వంటి మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలు నాశనం చేసుకోవద్దని తెలిపారు. ఎదురుగా వచ్చి పోరాడే శత్రువుతో ఎలాగైనా పోరాడవచ్చు, కానీ ఈ మత్తు పదార్థం అనే శత్రువు, మనకు తెలియకుండానే మన జీవితాన్ని నాశనం చేస్తుంది అని తెలిపారు. ఒకప్పుడు పట్టణాలలో ఉండే డ్రగ్స్ వాడకం క్రమంగా గ్రామాలకు పాకిందని, దీనివల్ల గ్రామాలలో యువత కూడా తప్పుదోవ పడుతున్నారన్నారు. నేటి యువత గంజాయికి అలవాటు పడితే దేశ భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. గ్రామాలలో మత్తు కోసం పేద ప్రజలు ఆల్పాజోలం కలిపిన కల్లును తీసుకుంటున్నారని, అది శరీరంలో నరాలపై తీవ్ర ప్రతాపం చూపుతోందన్నారు. దేశంలో 200 రకాల మత్తు పదార్థాలు ఉన్నాయన్నారు. డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి దేశంలో చాలామంది సెలబ్రిటీలు తమ జీవితాలను నాశనం చేసుకున్నారని ఉదాహరించారు. యువకులు తమ పరిసర ప్రాంతాలలో మత్తు పదార్థాల సరఫరాకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్‌రెడ్డి,ఎస్సై లెనిన్,ఎక్సైజ్ ఎస్సై నాగరాజు,ఫారెస్ట్ సెక్షన్‌ఆఫీసర్ సుకన్య,రెవెన్యూ ఇనిస్పెక్టర్ శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచులు, డిప్యూటీ సర్పంచులు, అంగన్‌వాడీ టీచర్లు, వార్డు మెంబర్లు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీఐ ప్రసాద్

పేదలకు సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

ఇందిరమ్మ ఇండ్ల శంకుస్థాపన

నవాబుపేట, మార్చి 30 ప్రభాతవార్త : పేదలకు సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్లు పేదలకు పక్కా ఇల్లు నిర్మాణం కాంగ్రెస్ ప్రభుత్వము లక్ష్యమని మాజీ డిసిసి అధికార ప్రతినిధి దుష్యంత్ రెడ్డి సోమవారం నవాబుపేట మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల శంకుస్థాపనలో అన్నారు. అలాగే లబ్ధిదారులకు ప్రొసీడింగ్లు అందజేసి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇల్లు కట్టుకునే ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వం తరఫున 5 లక్షల రూపాయలు ప్రతి ఇల్లుకు ఇవ్వడం నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ చేసే విధంగా అవినీతికి తావు లేకుండా ఈ పథకాన్ని ప్రవేశపెట్టిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నవాబుపేట గ్రామ సర్పంచ్ గీతా రాణి, కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ యువజన నాయకులు నీలకంఠం, బంక అంజన్ కుమార్, మార్కెట్ డైరెక్టర్ శివ కుమార్, బంక వెంకటయ్య, ఆనంద్, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొనడం జరిగింది.

ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేస్తున్న దుష్యంత్‌రెడ్డి

ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి

మొదటి పేజీ తరువాయి భాగం..

జె.ఎల్.బి.హరి ప్రియ,డిఆర్.ఓ రాంరెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. జిల్లా కలెక్టర్ దరఖాస్తు దారులతో మాట్లాడుతూ వారి సమస్యలను విని సంబంధిత అధికారులతో చర్చించి అర్జీలను పరిశీలించి సమస్యను పరిష్కారం చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో నున్న అర్జీలను ఆయాశాఖల అధికారులు వెంటనే పరిష్కారం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సిఈఓ వెంకట రెడ్డి, డిఆర్‌డిఓ నర్సింహులు వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సర్వేయర్ అజయ్ కి సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్ కుష్బూ గుప్తా

లైసెన్స్డ్ సర్వేయర్‌లకు సర్టిఫికెట్లు అందజేత

మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 30, ప్రభాతవార్త: జిల్లాలో 52 రోజుల శిక్షణ పొంది 40 రోజుల అప్రెంటిస్ పూర్తి చేసి పరీక్షలో ఉత్తీర్ణత సాదించిన రెండవ బ్యాచ్‌కు చెందిన 80 మంది లైసెన్స్డ్ సర్వేయర్ లకు సర్టిఫికెట్‌లను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం లో అందచేశారు. అదేవిధంగా మొదటి బ్యాచ్‌లో పరీక్ష పెయిలై సప్లిమెంటరీ పరీక్షలో ఉత్తీర్ణులైన 20 మందికి కూడా సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి.హరి ప్రియ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏ.డి.అశోక్, సూపరిండెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు భూమి పూజకు హాజరైన సర్పంచ్

ఎర్రవల్లి మార్చి 30, ప్రభాతవార్త : ఎర్రవల్లి మండల పరిధిలోని బీచుపల్లి గ్రామపంచాయతీ కొండపేట గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన ఆ రెల్లి భారతమ్మ, గొల్ల చంద్రమ్మ, నర్సమ్మ సోమవారము భూమి పూజ నిర్వహించగా ఇందిరమ్మ ఇల్లు భూమి పూజ కు బీచుపల్లి సర్పంచ్ విజిత బిసి రెడ్డి హాజరై పూజ నిర్వహించారు. పేదవారి సొంతింటి కల నిజం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ అరుణ, ఉప సర్పంచ్ నాగరాజు, గ్రామస్తులు సహదేవుడు, చిన్న వెంకటన్న,ఆదాం కురువ నారాయణ, గొల్ల అంజి మొదలగు వారు పాల్గొన్నారు.

పంచాయతీ భవనం పనుల పరిశీలన

నిర్మాణపు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ జిల్లెల జగత్ రెడ్డి

ఉప్పునుంతల, మార్చి 30 ప్రభాతవార్త : మండలంలోని అయ్య వారి పల్లి గ్రామం లో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనం నిర్మాణపు పనులను గ్రామ సర్పంచ్ జిల్లెల్ల జగత్ రెడ్డి పరిశీలించారు. గ్రామపంచాయతీ స్లాబ్ నిర్మాణ పనులు సోమవారం నిర్వహించడంతో పనులు పూర్తి అయ్యేంతవరకు భవనం వద్ద ఉండి పనులు పరిశీలించారు.

స్వయం పరిపాలన దినోత్సవం

స్వపరిపాలనలో విద్యార్థులు

**కొల్లా

పేదల సొంతింటి కల నెరవేరింది

◆ జడ్చర్ల మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత

ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న జడ్చర్ల మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత

జడ్చర్ల, మార్చి30, ప్రభాతవార్త : కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదల సొంతింటి కల ఇందిరమ్మ ఇంటి నిర్మాణంతో నెరవేరుతుందని జడ్చర్ల మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత అన్నారు. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులోని రాజీవ్ నగర్ కాలనీలో రామస్వామి నూతన ఇందిరమ్మ గృహప్రవేశ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు ఇందిరమ్మ ఇల్లుతో సొంత ఇంటి కల నెరవేర్చిందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి సమక్షంలో మరిన్ని ఇంది రమ్మ ఇల్లు స్థలం ఉన్నవాళ్ళకు కట్టుకునే విధంగా త్వరలోనే మంజూరు చేస్తారని తెలిపారు. కౌన్సిలర్లు చైతన్య చౌహాన్, బుక్క మహేష్, కుమ్మరి రాజు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కమలం శేఖర్, వార్డ్ ఆఫీసర్ జగన్, కాలనీవాసులు శివ, మధు, శ్రీను, గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెద్దొడ్డిలో ఇందిరమ్మ గృహప్రవేశం

గృహప్రవేశం లబ్ధిదారులచే రిబ్బన్ కట్ చేస్తున్న దృశ్యం

మల్దకల్ మార్చి 30, ప్రభాతవార్త: కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ముఖ్యంగా ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి పేద ప్రజల ఇంట్లో దీపం వెలిగించింది. రూ.5లక్షలతో చేపట్టే ఇందిరమ్మ గృహప్రవేశాలు విరివిగా జరుగుతున్నాయి. తాజాగా సోమవారం మల్దకల్ మండలం పెద్దొడ్డి గ్రామంలో ఎర్రంబావి సరస్వతి రామిరెడ్డి నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించడానికి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆదేశాలతో మాజీ డిసిసి అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్ రెడ్డి పాల్గొని లబ్ధిదారులచే రిబ్బన్ కట్ చేసి ఇందిరమ్మ గృహప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవానికి ముఖ్యంగా ఇల్లు లేని వారికి గుర్తించి వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి వాటిని నిర్మిస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదవారు చింతించాల్సిన అవసరం లేదన్నారు. మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు శేషంపల్లి తిమ్మారెడ్డి మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ళను ప్రభుత్వం నిర్మించి పేద ప్రజలకు అందజేస్తుందని ప్రతి లబ్ధిదారుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలను హర్షిస్తున్నారని తెలిపారు. మాజీ ఎంపీటీసీ తాటికుంట చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో పేద ప్రజలకు పెద్దపీట వేసి వారిని అభివృద్ధికి తెస్తుందని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు గ్రామాలలో అమలవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాముడు, నాగేష్, తదితరులు పాల్గొన్నారు

ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేసేలా కృషి చేయాలి

ఉప్పునుంతల, మార్చి 30 ప్రభాతవార్త : పేదల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు పరుస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి అయ్యేలా పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని ఇంచార్జీ ఎంపిడిఓ రేవత్ రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక ఎంపీపీ సమావేశపు హాలులో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ కులాలకు చెందిన వారికి బ్యాంకు ద్వారా లోను ఇవ్వడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, అందులో భాగంగా 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 02 ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో గ్రామసభ ఏర్పాటు చేయాలని కోరారు. ఈసమావేశంలో ప్రభుత్వ పథకాలు లబ్ది పొందిన లబ్ధిదారుల జాబితాను అందజేయాలని సూచించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మీద జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరు 100 రోజుల పనిదినాలు పూర్తి చేయాలని కోరారు. విధి నిర్వహణలో నిరక్ష్యం చేయకుండా ప్రభుత్వ పథకాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వారికి సూచించారు. ఈ.సమావేశంలో ఇంచార్జీ ఎంపిడిఓ తుమ్మల రేవత్ రెడ్డి, ఈజీఎస్ ఏపీఓ పర్వతాలు, సూపరింటెండెంట్ వెంకటేష్, ఈసిజి కుర్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శి అల్లాజీ, మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శుల, జిపిఓ, పంచాయతీ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ తాగునీటిపై సమావేశం

పెద్దమందడి, మార్చి30 ప్రభాతవార్త : మండల పరిధిలోని ముందరి తాండలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం మిషన్ భగీరథ త్రాగునీటిపై మిషన్ భగీరథ ఏఈ హరి ప్రకాష్, గ్రామ సర్పంచ్ సమావేశం నిర్వహించారు. ముందు జాగ్రత్త వేసవికాలం ఉండడంతో త్రాగునీరు సమస్య పై చర్చించారు. ఎండాకాలం ఉండటంతో త్రాగునీరు వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని వారన్నారు. మిషన్ భగీరథ త్రాగునీరు పైపులైన్లు లీకేజీలు లేకుండా నీరు వృధా కాకుండా చర్యలు చేపట్టాలన్నారు . ఈ సందర్భంగా సర్పంచ్ గ్రామ అభివృద్ధికి అందరూ సహకరించాలని వారు కోరారు. మన గ్రామ మన అభివృద్ధికి సహకరించాలని అన్నారు. ఉపాధి హామీ పథకం క్రింద కూలీలు మన తాండాలో పనులలో గుర్తించి ఉపాధి కూలీల్లో పనులు చేసుకోవాలన్నారు. గ్రామంలోని పలు సమస్యలు ఉన్న గ్రామపంచాయతీ దృష్టికి తీసుకురావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మిషన్ భగీరథ ఏఈ హరి ప్రకాష్, పంచాయితీ కార్యదర్శి సుచిత్ర, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ఆత్మకూర్ మార్చి 30, ప్రభాతవార్త: ఆత్మకూరు మండలంలోని మూలమల్ల గ్రామంలో దేశాయి సల్లారెడ్డి జ్ఞాపకార్థం సోమవారం రోజు చేతిరాళ్ల పందెపు పోటీలను నిర్వహించారు. గద్వాల్, వనపర్తి జిల్లాలకు చెందినచేతిరాళ్ల పందెపుదారులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజేతలవా నించారు. నాగర్ దొడ్డి గ్రామానికి చెందిన ప్రతాప్ మొదటి బహుమతి గెలుపొందగా, రెండవ బహుమతి వెంకటేష్ మూడవ బహుమతి ప్రకాష్ తదితరులు విజయం సాధించారు. మొదటి బహుమతిగా గెలుపొందిన వెంకటేష్ 120 కేజీల పందెపురాయిని అలవోకగా ఎత్తి విజయం సాధించగా పదివేలరూపాయల నగదు బహుమతిని అందుకున్నారు. ఉదయం నుంచి ప్రారం భమైన పందెపురాళ్ల పోటీలు సాయంత్రం వరకు మూలమల్ల గ్రామ సర్పంచ్ రంగారెడ్డి కబడ్డీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలు దేశాయి పద్మజా రెడ్డి తదితరులు ప్రారంభించి అనంతరం విజేతలకుబహుమతులను ప్రధానం చేశారు, ఈ సందర్భంగా పద్మజా రెడ్డి మాట్లా డుతూ తెలంగాణ ప్రాంతంలో అత్యంత ప్రాచుర్యం పొందిన పందెపురాళ్ల పోటీలను నిర్వహిం చేందుకు గ్రామస్తులు సహకరించడం ఎంతో అభినందనీయమన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కబడ్డీ పోటీలు అనే కాకుండా గ్రామీణ ప్రాంతాల సంస్కృతి సాంప్రదాయాలను నిలిపే విధంగా పందెపురాళ్ల పోటీలను భవిష్యత్తులో కూడా నిర్వహించేందుకు తమ వంతు కృషి చేస్తామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులతో పాటుగా అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

దామరగిద్ద, మార్చి 30 ప్రభాతవార్త : నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు దామరగిద్ద మండలంలో 99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా దామరగిద్ద మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, క్యాతన్ పల్లి, మొగల్ మడక, కానుకుర్తి రైతు వేదిక వద్ద గ్రామాల్లో డ్రగ్స్ వ్యతిరేకంగా స్టేట్ ఈగల్ టీం, దామరగిద్ద ఎస్సై రాజు ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, యువతకు డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై వివరించారు. కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి, డ్రగ్స్ వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఈగల్ ఫోర్స్ డీఎస్పీ సోమనాథం మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి తమ లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. సమాజంలో డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఎవరైనా డ్రగ్స్ వినియోగం లేదా అక్రమ రవాణా గురించి సమాచారం తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1908 లేదా డయల్ 100 కు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిలానదర్ తిరుపతయ్య, ఎంపీడీఓ లక్ష్మి, ఎంఈఓ కృష్ణరెడ్డి, కోస్గి ఎక్సైజ్ సీఐ బాలకృష్ణ, పాఠశాల హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచులు, డిప్యూటీ సర్పంచులు, యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని డ్రగ్స్ వ్యతిరేకంగా తమ మద్దతును తెలిపారు.

మంచినీటి సమస్య పరిష్కారానికి పనులు చేపట్టిన గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్

శ్రీరంగాపూర్, మార్చి 30 ప్రభాతవార్త: శ్రీరంగాపురం మండలంలోని వెంకటపురం గ్రామంలో మంచినీటి సమస్య చాలా రోజుల నుంచి నెలకొని ఉండేది. ఈ సమస్యను గ్రామ సర్పంచ్ దృష్టికి గ్రామ ప్రజలు తీసుకుపోగా నీటి సమస్యను తీర్చి గ్రామంలోని ప్రజలకు మంచినీటిని అందిం చుటకు పైపులను ఏర్పాటు చేసి అవసరమైన దగ్గర గేట్ వాల్‌లను అమర్చి ఒకటి, రెండు, మూడు వార్డులకు నీటి కొరత లేకుండా సమస్యను పరిష్కరించడం జరిగింది. సంతోషాన్ని వ్యక్తం చేస్తూ వార్డు ప్రజలు సర్పంచుకు ఉప సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సురగౌని భారతి ఎల్లాగౌడ్, ఉపసర్పంచ్ సామేలు, గ్రామ పంచాయతీ సిబ్బంది ఎల్లయ్య ఎల్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

అడుగంటిన జలాశయం.. ఎండిన వరి పంటలు

నీరు వదలాలని వేడుకున్న పట్టించుకోలే..

ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం ఇవ్వాలి

బిఆర్ఎస్ నాయకుల డిమాండ్

అడుగంటిన పర్దిపూర్ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న నేతలు, రైతులు

చిన్న చింతకుంట, మార్చి30 ప్రభాతవార్త : రిజర్వాయర్ నీటిపై ఆధారపడి సాగు చేసిన వరి పంటలు ప్రస్తుతం అడుగంటిన జలాశయంతో తమ వరి పంటలు ఎండిపోతున్నాయని రైతన్న తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. మండలంలోని పర్దిపూర్ రిజర్వాయర్ కింద వేయి ఎకరాలలో వరి పంట సాగు చేశారు. జలాశయంలో నీరు అడుగంటి పోవడంతో రైతులు వేసిన పంటలకు సాగునీరు రాక గింజ దశలో ఉన్న పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నో కష్టాలు పడి వరి పంటను సాగు చేసుకున్న తీరా చూస్తే సాగునీరందుక తమ పంటలు పొట్ట దశలో ఎండిపోతున్నాయని స్థానిక ఎమ్మెల్యే జిఎంఆర్, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ఇప్పటివరకు సాగునీరు రాలేదని పర్దిపూర్ రైతులు గోడు వెళ్ళబోసుకుంటున్నారు. జూరాల ప్రాజెక్టులో నీళ్లు ఉన్నాయని ఒక దఫా పర్ది పూర్ రిజర్వాయర్ కు సాగునీటిని విడుదల చేసి ఒక్క తడి వరి పంటకు వదిలితే బాగుంటుందని రైతులు కోరుతున్నారు. సాగునీరు పై ఆధారపడ్డ రైతులకు పంటలకు సరిపడా నీటిని విడుదల చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బిఆర్ఎస్ మండల అధ్యక్షులు కోట రాము ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం రిజర్వాయర్ కింద సాగు చేసిన పంటలను పార్టీ నేతలు, రైతులతో కలిసి పరిశీలించారు. పొట్ట దశలో ఉన్న వరి పంట ఒక్క దఫా నీటి విడుదల చేస్తే రైతులకు నష్టం జరగదని ఆయన తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే దృష్టికి రైతులు తీసుకెళ్లిన ఇప్పటివరకు సాగునీటి సమస్య తీర్చలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పల్లెల్లో రైతులు సాగునీరు అందక ఎండుతున్న పంటలను చూడలేక కన్నీరు పెడుతున్నారన్నారు. రైతు దుఃఖం ప్రభుత్వానికి మంచిది కాదని వెంటనే సాగునీటిని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎండుతున్న పంటలకు ఎకరాకు 50 వేలు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టిఆర్ఎస్ మండల నాయకులు సంతోష్ రెడ్డి, స్వామి, నరసింహ, గిరిమోని నరసింహ, యూత్ అధ్యక్షులు బైని బాలరాజ్, రైతులు బురనప్ప, ప్యాట మల్లేష్, చర్లపల్లి గోవిందు, కటిక రాజు, తెలుగు వెంకటేష్, గిరిమోని ఆంజనేయులు, పూజారి బుచ్చప్ప, పూజారి మల్లేష్, నడిపి మల్లప్ప, పెద్ద బురణప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎండుతున్న వరి పంటను రైతులతో కలిసి పరిశీలిస్తున్న బిఆర్ఎస్ నేతలు

యువత డ్రగ్స్‌కు బానిస కావొద్దు

◆ డ్రగ్స్ నిర్మూలన అధికారి డిఎస్‌పి ఉపేందర్

చిన్న చింతకుంట, మార్చి 30 ప్రభాతవార్త : యువత డ్రగ్స్ కు బానిసైతమ విలువైన జీవితాలను పాడు చేసుకోవద్దని డ్రగ్స్ నిర్మూలన అధికారి డిఎస్పి ఉపేందర్ సూచించారు. సోమవారం లాల్‌కోట, ఫర్దీపూర్, వడ్డేమాన్, చిన్న చింతకుంట గ్రామాలలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 5వ అంశం మైన పిల్లల భద్రతకై మాదకద్రవ్యాల నిర్మూలన పై అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ సదస్సుకు డ్రగ్స్ నిర్మూలన అధికారి డిఎస్పి హాజరై మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువత డ్రగ్స్‌కు దూరంగాఉంటూ చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకో వాలన్నారు. తమ పిల్లలను క్రమశిక్షణతో పెంచుతూ ఎప్పటిక ప్పుడు వారిపై నిఘా పెట్టి సన్మార్గంలో నడిచేలా చూసుకునే బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. నేటి యువత సిగరెట్లు, మద్యం, డ్రగ్స్ అలవాటు పడి చెడు మార్గాలలో నడుస్తూ ఇటు కుటుంబాన్ని అటు ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారన్నారు. ఎస్సైకృష్ణ ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసై విద్యలో రాణించలేక అవమానాలకు గురై తమవిలువైన ప్రాణాలను తీసుకుంటున్నారన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూతల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ఈ సదస్సులో ఎక్సైజ్ ఎస్సై సుధాకర్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు గోపాల్, శివకుమార్, ఈశ్వర్ సింగ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మత్తులో పడితే జీవితాలు చిత్తు...

మత్తుకు బానిసై అందమైన జీవితాలను నాశనం చేసుకోవద్దు

చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే ఎవరికైనా శిక్ష తప్పదు

హైదరాబాద్ ఆంటీ డ్రగ్స్ డిఎస్పి రమేష్,

దేవరకద్ర ఎస్సై నాగన్న

ప్రతిజ్ఞ చేస్తున్న పోలీస్ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

మత్తు పదార్థాలు, డ్రగ్స్ తీసుకోవడం వల్ల అనర్థాల గురించి లోగోను చూయిస్తున్న పోలీస్ అధికారులు

దేవరకద్ర, మార్చి 30 ప్రభాతవార్త: మత్తు పదార్థాల (డ్రగ్స్)వల్ల కలిగే నష్టాలు, ప్రమాదాలు, ఆరోగ్య సమస్యలు సమాజం పై ప్రభావం గురించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం సోమ వారం దేవరకద్ర మండల కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్‌లో ఏర్పా టు చేసిన కార్యక్రమంలో యాంటీ డ్రగ్స్ హైదరాబాద్ డి.ఎస్.పి రమేష్, స్థానిక దేవరకద్ర ఎస్సై నాగన్న, ఫారెస్ట్ స్పెషల్ అజ్జాజులా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డిఎస్పి రమేష్ మాట్లా డుతూ తాత్కాలిక ఆనందం కోసం సరదాగా ప్రారంభమయ్యే మాదకద్రవ్యాల వినియోగం క్రమంగా వ్యక్తులను బానిసలుగా మార్చేస్తుంది. ప్రధానంగా యువత వీటికి అలవాటు పడితే వారి బంగారు భవిష్యత్తు అందాకారంగా మారడంతో పాటు, వారి కుటుంబాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఉమ్మడి జిల్లాలో, దేవరకద్ర నియోజకవర్గంలో యువత గంజాయి తదితర మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారు. కొందరు లారీ డ్రైవర్లు నల్ల మందు గసగసాల పువ్వులను నానబెట్టి తీసే కాషాయాన్ని సైతం తాగుతుంటారు. మరికొందరు నిషా కోసం మత్తు మందు ఇంజక్ష న్లు సైతం తీసుకునే వారున్నారు. వీటికి బానిసలుగా మారిన వారిని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే త్వరగా కోలుకుంటారు. ఆలస్యం చేస్తే మాత్రం తీవ్ర దుష్పరిమానాల బారిన పడతారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం మాదక ద్రవ్యాల నియంత్రణకు పగడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించింది. యువకులు నిత్యం గంజాయి తాగుతూ బానిసలుగా మారారు. గుట్కా పొగాకు నకిలీ కళ్ళు తాగుతూ ఆరోగ్యాలు పాడు చేసుకుం టున్నారు. కొందరు బానిసలుగా మారి అవి లేనిదే ఏ పని చేసు కోలేని దుర్భర పరిస్థితుల బారిన పడ్డ వారున్నారు. అదేవిధంగా మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల వ్యక్తుల ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. మానవ శరీరంలో అన్ని భాగాలను మారకద్రవ్యాలు ప్రభాయితం చేసి, తీవ్ర దుష్పరిమానాలను కలిగిస్తాయి. పక్షవాతం బారిన పడే అవకాశాలు కూడా ఉంటాయి. మనిషినిద్రలేమికి గురై రక్తపోటుకు గురయ్య అవకాశాలుంటాయి. ఈ సందర్భంగా పాఠశాలలో కళాశాలలో, చదువుతున్న పిల్లలపై కుటుంబ సభ్యులు ఉపాధ్యాయులు సైతం ప్రత్యేక దృష్టి సారిస్తూ ఉండాలి. వారి ప్రవర్తనలో ఏమాత్రం మార్పు కనిపించిన కారణా లు తెలుసుకునే ప్రయత్నం చేయాలి. ఒకవేళ మారకద్రవ్యాలు, దురాలవాట్లు, బారిన పడుతున్నారని తెలిస్తే వారికి కౌన్సెలింగ్ ఇప్పించి ఆ అలవాట్లను మానిపించాలి.

మత్తుకు బానిసై అందమైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దు...

దేవరకద్ర ఎస్ఐ నాగన్న..

మాదకద్రవ్యాలకు ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలన్నారు. వాటి వల్ల ఎన్నో జీవితాలు నాశనం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యువత మాదకద్రవ్యాలపై అవగాహన పెంపొందించు కోవాలని సూచించారు. అనంతరం మాదకద్రవ్యాలపై పోరాడు తామని ప్రతిజ్ఞ చేశారు. అదేవిధంగా యువత వ్యసనాలకు బానిస కావద్దని ఎస్సై విద్యార్థులను సూచించారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడడం వల్ల తమ జీవితాలు నాశనం కావడంతో పాటు కుటుంబాలు రోడ్డున పడుతాయని తెలి పారు. చట్టా వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే ఎవరైనా సరే శిక్ష తప్పదు అన్నారు. ప్రతి ఒక్కరు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. రసాయనాలతో కల్తీ చేసిన పండ్లు తీసుకో వడం వల్ల ఆరోగ్యానికి హానికరం అన్నారు. నకిలీకల్తీ మద్యం తాగడం వల్ల ఆరోగ్యానికి చాలా ప్రమాదకరమన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలు, యువకులు, కల్తీకల్లుకు, డ్రగ్స్‌కు, బానిసలు కావద్దన్నారు. కల్తీకల్లు, డ్రగ్స్‌కు ప్రభుత్వం ఉక్కు పాదం మోపిందన్నారు. ఎవరైనా ఇటువంటి మాదకద్రవ్యాలు అమ్మి నట్లయితే 1980 కు సమాచారం అందించాలని దేవరకద్ర ఎస్ఐ నాగన్న కోరారు. అనంతరం దేవరకద్ర మండలం వెంకటాయపల్లి గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో, మరియు కోయిల్ సాగర్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాలను నిర్వ హించారు. తదనంతరంఅధికారులు, విద్యార్థులు అంగన్వాడి కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు కలిసి మాదాకద్రవ్యాల నిర్మూల నకు కట్టుబడి పని చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ స్పెషల్‌ఆఫీసర్‌డ్ అజాజుల్లా, ఎంఈఓ బలరాం, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవో సీతానాయక్, మున్సిపల్ చైర్మన్ దమ యంతి గోవర్ధన్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ యుగంధర్‌రెడ్డి, అంగన్‌వాడి సూపర్‌వైజర్, వెంకటాయపల్లి గ్రామ సర్పంచ్ రామాంజనేయులు, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో 45 ఫిర్యాదులు స్వీకరణ

ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని అధికారులకు కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశం

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

నారాయణపేట, మార్చి 30 ప్రభాతవార్త: జిల్లాలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు విశేషంగా స్పందిస్తూ తమ సమస్యలను తెలియజేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆధ్వర్యంలో ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 45 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్య తనిస్తూ వచ్చిన ప్రతి ఫిర్యాదును సత్వరమే పరిష్కరించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అర్జీల రూపంలోసమర్పించగా, కలెక్టర్ వాటిని శ్రద్ధగా విని సంబంధితశాఖ అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా నిరంతరం పరిశీలన జరిపి త్వరితగతిన పరిష్కరించాల్సిందిగా ఆయన అధి కారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

14ఏళ్ల బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్

- మండలంలోని 419మంది బాలికలకు టీకాలు
- భూత్పూర్ మండల పీహెచ్‌సీ ఎంఓ డా. మొహ్మద్ అబ్దుల్ రబ్

భూత్పూర్, మార్చి 30, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యశాఖ 14ఏళ్లున్న బాలికలకు హ్యూమన్ ప్యాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) వ్యాక్సిన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుందని, ఇందుకనుగుణంగానే ఈ నెల 30వ తేదీ సోమవారం నుంచి భూత్పూర్ పీహెచ్‌సీలో వ్యాక్సినేషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు భూత్పూర్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) మెడికల్ ఆఫీసం ్(ఎంఓ) డాక్టర్ మొహ్మద్ అబ్దుల్ రబ్ తెలిపారు. సోమవారం ఆయన 'ప్రభాతవార్త' ప్రతినిధితో మాట్లాడుతూ బాలికల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించేందుకు, కాన్సర్ ఇతర రోగాల బారి నుంచిబాలికలు కాపాడుకునేందుకు ఈ వ్యాక్సిన్ ఎంతో ఉపయో గపడుతుందన్నారు. భూత్పూర్ మండలంలో 14ఏళ్లున్న బాలికలు 419 మంది ఉన్నట్లు సర్వే రిపోర్టు ద్వారా తెలుస్తోందని, వీరందరికి వ్యాక్సిన్ ఇచ్చేందుకు తమ పీహెచ్‌సీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంధి ప్రయత్నిస్తున్నారని చెప్పారు. మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, పట్టణంలోని పది వార్డుల కౌన్సిలర్లు చొరవ చూపి బాలికల తల్లితండ్రులకు వ్యాక్సి న్ ఉపయోగాలను తెలిపి వారిని టీకా వేసుకునేలా చూడాలని డాక్టర్ రబ్ కోరారు. తొలిరోజైన సోమవారం భూత్పూర్ పీహెచ్‌సీ లో మొత్తం 30మంది బాలికలు టీకా తీసుకున్నారని తెలిపారు. వ్యాక్సిన్ మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మాత్రమే ఇస్తారని, మండలంలో 14ఏళ్లు నిండిన బాలికల తల్లితండ్రులు ఈ విషయా న్ని గమనించి14ఏళ్లు నిండిన తమ పిల్లల్ని భూత్పూర్ పీహెచ్‌సీకి తీసుకువచ్చే ప్రయత్నం చేయాలని డాక్టర్ రబ్ సూచించారు.

పిడుగు పడి పాడి ఆవు మృతి

వెల్దండ, మార్చి30 ప్రభాతవార్త: వెల్దండ మండలంలోని అజి లాపూర్‌లో ఆకాల వర్షంతో గ్రామానికి చెందిన కేశమోని శ్రీశైలం లోని వ్యవసాయ పొలంలో పాడి ఆవు పై పిడుగు పడి అక్కడ ్కక్కడే మృతి చెందింది. కుటుంబానికి జీవనాధారమైన పాడి ఆవు మృతి చెందడంతో రైతు బోరున విలపించాడు. ప్రభుత్వ పరంగా రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు రైతులు కోరారు.

రేవల్లిలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రారంభం

రేవల్లి, మార్చి30 ప్రభాతవార్త: రేవల్లి మండల కేంద్రంలో కమ్యూ నిటీ హెల్త్ సెంటర్‌లో హెచ్ పీవీ

ఉదండాపూర్ నిర్వాసితులకు మరో రూ.150కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. ఉదండాపూర్ నిర్వాసితులలో మరింత ఎక్కువ పరిహారాన్ని కోరుతూ కొంత మంది కోర్టుకు వెళ్ళడం జరిగిందని వారితో కూడా మాట్లాడి వారికి రావాల్సిన పరిహారాన్ని కూడా అందరితో పాటు ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని ఇదివరకే మంత్రి ఉత్తమ్‌ను కోరామని తెలిపారు. ఉదండాపూర్ నిర్వాసితులకు రావాల్సిన బకాయిలను పూర్తిగా ఇప్పించడంతో పాటుగా గతంలో మల్లన్నసాగర్ ప్రాజెక్ట్ నిర్వాసితులకు వారికి కేటాయించిన ప్లాట్లను రిజిస్టర్ చేసి ఇవ్వడం జరిగిందని అదే విధంగా ఉదండాపూర్ నిర్వాసితులకు ఇస్తున్న ప్లాట్లను కూడా రిజిస్టర్ చేసి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరామని చెప్పారు. ఈ విషయంగురించి ఇదివరకే జిల్లా కలెక్టర్ తో కూడా మాట్లాడానని అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు.

కలెక్టరేట్‌లో ప్రత్యేక వైద్య శిబిరం

మహబూబ్‌నగర్, మార్చి 30, ప్రభాతవార్త: ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఒక రోజు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో పిల్లల వైద్య నిపుణులు, ఎముకల వైద్య నిపుణులు, జనరల్ మెడిసిన్, ప్రసూతి గైనకాలజీ, కంటి వైద్యం, మహిళల ఆరోగ్య నిపుణులు తదితర విభాగాలకు చెందిన వైద్యులు పాల్గొని కలెక్టరేట్ సిబ్బంది, సాధారణ ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించారు. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ప్రత్యేక ఆరోగ్య శిబిరంను సందర్శించివైద్య పరీక్షలు గురించి తెలుసుకున్నారు. అధికారులు, ఉద్యోగులు ప్రత్యేక వైద్య క్యాంపును సద్వినియోగం చేసుకుని ఆరోగ్య వైద్య పరీక్షలు నిర్వహించుకుని డాక్టర్ల సలహాలు, మందులు తీసుకోవాలని సూచించారు. స్థానిక సంస్థలఅదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జెఎల్‌బి. హరిప్రియ వైద్య శిబిరాన్ని సందర్శించి స్వయంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్య సిబ్బంది సేవలను వారు అభినందించారు. ఎదిర పిహెచ్సి ఆధ్వర్యంలో మెడికల్ ఆఫీసర్ నరేష్ చంద్ర వైద్య బృందం పరీక్షలు నిర్వహించారు.

ఆలయ పవిత్రతను కాపాడుకుందాం!

శ్రీకురుమూర్తి ఆలయ పరిరక్షణ సమితి సభ్యులు

చిన్న చింతకుంట, మార్చి 30 ప్రభాతవార్త : శ్రీ కురుమూర్తి స్వామి ఆలయ పవిత్రతను కాపాడుకునేందుకే సంతకాల సేకరణ ఉద్యమాన్ని చేపడుతామని శ్రీ కురుమూర్తి స్వామి ఆలయం పరిరక్షణ సమితి సభ్యులు తెలిపారు. సోమవారంక్వారీకి వ్యతిరేకంగా అమ్మాపూర్‌లో సంతకాల సేకరణకు శ్రీకారం చుట్టారు. శ్రీ కురుమూర్తి స్వామి ఏడు గుట్టలలో ఒకటైన శేషాద్రి గుట్ట దీనినే తిప్పగుట్ట అంటారు. ఆలయానికి కూత వేటు దూరంలో గల తిప్పగుట్టలో మైనింగ్‌కు అనుమతులుఇచ్చేందుకు ఆయాశాఖల అధికారులు ప్రయత్నించడం దారుణమన్నారు. పర్యావరణానికి, వన్యప్రాణులకు నిలయంగా ఉన్న శేషాద్రి గుట్టను బ్లాస్టింగ్‌లతో చెరిపేస్తామని చూస్తే స్వామివారి ఆగ్రహానికి గురికాకతప్పదన్నారు. వెంటనే శ్రీకురుమూర్తి స్వామిగుట్టల్లో క్వారీ ఏర్పాటుకై అనుమతులు ఇవ్వడం మానుకోవాలని ఆలయ పరిరక్షణ సమితి సభ్యులు హెచ్చరించారు. ఈ సంతకాల సేకరణ ఉద్యమం గ్రామ గ్రామానికి చేరుకుంటుందన్నారు. స్వామి వారి భక్తులు, హిందువులు పెద్ద ఎత్తున ఈ సంతకాల సేకరణలో భాగస్వాములు కావాలని పరిరక్షణ సమితి సభ్యులు తెలిపారు.

వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన యువనేత అభిమన్యురెడ్డి

రాజాపూర్, మార్చి 30 ప్రభాతవార్త : రాజాపూర్ మండలం నర్సింగ్ తండా గ్రామపంచాయతీ ఇబ్రహీంపల్లి గ్రామంలో గ్రామ ఉపసర్పంచ్ యాదగిరి నూతనంగా ఏర్పాటు చేసిన కూల్ వాటర్ మినరల్ వాటర్ ప్లాంట్ ను జడ్చర్ల బిఆర్ఎస్ పార్టీ యువనేత చించోడ్ అభిమన్యు రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వాటర్ ప్లాంట్, కూల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన ఉప సర్పంచ్ యాదగిరిని అభినందిస్తూ... గ్రామ ప్రజలకు పరిశుభ్రమైనతాగునీరు అందించడంద్వారాఆరోగ్య సమస్యలను నివారించవచ్చని, ప్రజల ఆరోగ్యానికి ఇది ఎంతో కీలకమని అయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ తండా గ్రామపంచాయతీ సర్పంచ్ శీను నాయక్, అలాగే సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు కావలి రామకృష్ణ, వీరితో పాటు పలువురు నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల అందజేత

మక్తల్ టౌన్, మార్చి 30 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర క్రీడ పాఠశాలలలో 4వ తరగతిలో ప్రవేశం పొందుటకు, ప్రస్తుతము 3వ, తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న మక్తల్ మండలంలోని 17 మంది బాల బాలికలకు,అందులో మక్తల్ మున్సిపాలిటీ ప్రక్కనగల ప్రాథమిక పాఠశాల (జిపి) నుండి, పాఠశాల ఎస్‌జిటి టీచర్, జాతీయ స్థాయి క్రీడాకారిని బి.దీప ద్వారా 8 మంది దరఖాస్తు చేసుకున్న బాలబాలికలకు, ఇతర పాఠశాలల చెందిన 9 మంది బాలబాలికలకు ఈనెల 10 నుండి ఉచితంగా క్రీడా దుస్తులు అందజేసి, క్రీడా పాఠశాలకు సంబంధించిన తొమ్మిది క్రీడ అంశాలలో జిల్లా సైకిలింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, విశ్రాంత పిఈటి బి.గోపాలం తెలిపారు. ఈనెల30 వరకు20 రోజులపాటు మెరుగైన శిక్షణ ఇవ్వడము జరిగిందనీ ఈనెల 30న శిక్షణ ముగింపు కార్యక్రమంలో క్రీడాప్రతిభను ప్రదర్శించినబాలబాలికలకు మెడల్స్ అందజేసి అభినందించారు. బి.గోపాలం మాట్లాడుతూ ఈనెల 31న నారాయణపేట జిల్లా కేంద్రంలో జరుగు క్రీడా పాఠశాల ఎంపికలో ప్రతిభ చాటి, రాష్ట్రస్థాయి ఎంపికలకు ఎంపికై, తప్పకుండా రాష్ట్ర క్రీడా పాఠశాలలో ప్రవేశం పొందే విధంగా తర్ఫీదు ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. మక్తల్ ప్రాథమిక పాఠశాల (జిపి) హెచ్ఎం అశోక్ మాట్లాడుతూ రిటైర్మెంట్ తర్వాత కూడా క్రీడలకు సేవలందిస్తున్న బి.గోపాలమును శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.దీప, టి. శ్వేత, భార్గవి, జాతీయస్థాయి క్రీడాకారులు దివ్య, నందిని, మేఘన, తల్లిదండ్రులు కృష్ణమూర్తి, లక్షి మ్మ, నగేష్, గిరి, బాల బాలికలు పాల్గొన్నారు.

సిసి రోడ్లతో గ్రామాల రూపురేఖలను మారుస్తాం

మాజీ సింగల్ విండో అధ్యక్షులు సంకాపురం రాముడు

అయిజ మార్చి 30,ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం అందించే నిధులతో గ్రామాల్లో సిసి రోడ్లు వేయించి గ్రామాల రూపురేఖను మారుస్తామని మాజీ సింగల్ విండో అధ్యక్షులు సంకాపురం రాముడు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ఏ క్లాస్ పురం గ్రామపంచాయతీ లో గల దేవబండ గ్రామంలో గ్రామ సర్పంచ్ కురువ నాగన్న తో కలిసి సిసి రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందించే నిధులతో గ్రామాల మౌలిక వసతులతో పాటు పర్యావరణం పరిశుభ్రతలో భాగంగా అభివృద్ధిపనులు చేపడతామని తెలిపారు. ఈ పనులు పార్టీలకతీతంగా గ్రామ సర్పంచ్, వార్డు మెంబర్లు, ఆయా పార్టీల నాయకులు, సమన్వయంతో పనులు చేసి గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని గ్రామస్తులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పించిన ఎస్ఐ రాజశేఖర్

రాజాపూర్, మార్చి30 ప్రభాతవార్త : డ్రగ్స్‌కు అడ్డుకట్ట వేద్దాం ఆ భూతాన్ని తరిమి కొడదామని రాజాపూర్ మండల సబ్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ అన్నారు. పిల్లల భద్రత.. డ్రగ్స్ కు అడ్డుకట్ట అంశంపై సోమవారం రాజాపూర్ మండలంలో అవగాహన కార్యక్రమాలు నాలుగు గ్రామాలలో నిర్వహించడం జరిగింది. రాజాపూర్ మండలంలో.. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం హైదరాబాదు ఈగల్ టీం డీఎస్పీ టి. శివన్ నాయుడు ఆధ్వర్యంలో పిల్లల భద్రత డ్రగ్స్ కు అడ్డుకట్ట అంశంపై అవగాహన సదస్సు ఈ క్రింది గ్రామాలు 1 తిరుమలాపూర్..2. రంగారెడ్డి గూడ..3...ఈద్గాన్ పల్లి 4. రాజాపూర్ మండల కేంద్రంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంఈఓ ఎ. సుధాకర్, ఎస్సై రాజశేఖర్, యాదగిరి చైల్డ్ హెల్ప్ లైన్ కౌన్సిలర్, ప్రభుత్వ అధికారులు, ఆయా గ్రామాల సర్పంచ్ లు సంతోష, వెంకటేష్, రేవతి, ఆనంద్, గణేష్ యాదవ్, రామకృష్ణ, ప్రజా ప్రతినిధులు, ప్రజలు హాజరయ్యారు.

ముందస్తు అరెస్టులు తగదు : మాజీ సర్పంచ్ గోవిందు నాయక్

రాజాపూర్, మార్చి 30 ప్రభాతవార్త : అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్న తరుణంలో సోమవారం మాజీ సర్పంచులను ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేయడం తగదని రాజాపూర్ మండలం బిబి నగర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ గోవింద్ నాయక్ పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాలను సర్పంచులు అడ్డుకుంటారన్న ఉద్దేశంతో తమను పోలీసులను పెట్టి ముందస్తు అరెస్టులు చేయడం సీఎం రేవంత్ రెడ్డి మానుకోవాలని గోవింద్ నాయక్ అన్నారు.

పర్యాటక ప్రాంతాల్లో బస చేయండి

- టూరిజం అభివృద్ధి, ప్రమోషన్‌లో భాగస్వాములు కండి
- మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మంత్రి జూపల్లి లేఖ

ఎమ్మెల్యేల బృందంతో మంత్రి జూపల్లి

కొల్లాపూర్, మార్చి30 ప్రభాతవార్త: రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలకు విస్తృత ప్రచారం కల్పించేందుకు ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆయన లేఖ రాశారనీ మంత్రి జూపల్లి క్యాంపు కార్యాలయం వర్గాలు తెలిపాయి. అసెంబ్లీలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులకు స్వయంగా మంత్రి లేఖలను అందజేస్తూ.. పర్యాటకఅభివృద్ధిలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం కీలకమని చెప్పారు. ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు శాసనసభ, మండలి కార్యదర్శుల కార్యాలయం ద్వారా లేఖలను పంపారు. తెలంగాణ అనాది చరిత్ర, అపూర్వ వారసత్వం, ప్రకృతి సౌందర్యానికి నిలయమని మంత్రి పేర్కొన్నారు. కాకతీయుల శిల్పకళ,ఆధ్యాత్మిక క్షేత్రాలు, నదులు,జలపాతాలు,అరణ్యాల అందాలు రాష్ట్ర ప్రత్యేకతను చాటుతున్నాయని తెలిపారు. గుస్సాడి నుంచి పెరిణి, బతుకమ్మ నుంచి బొనాలు వరకు విస్తరించిన సాంస్కృతిక వైవిధ్యం తెలంగాణ గర్వకారణమన్నారు. ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాలకు సమీపంలోని పర్యాటక ప్రదేశాలను కనీసం రెండు రోజుల పాటు సందర్శించాలని మంత్రి కోరారు. ఆ ప్రదేశాల విశిష్టత, అనుభవాలను ప్రజలకు వివరించి పర్యాటకులను ప్రోత్సహించాలని సూచించారు. దీంతో ప్రజల్లో పర్యాటకంపై ఆసక్తి పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. పర్యటనలకు సౌలభ్యం కల్పించేందుకు హరిత హోటళ్లలో వసతి కోసం ప్రత్యేక కూపన్లు అందజేస్తామని మంత్రి తెలిపారు. తెలంగాణ పర్యాటక, చారిత్రక, సాంస్కృతిక విశేషాలపై సమగ్ర డిజిటల్ సమాచారం, విజువల్ కంటెంట్‌ను త్వరలో ప్రజాప్రతినిధులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పర్యాటక రంగం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి శక్తివంతమైన సాధనమని మంత్రి పేర్కొన్నారు. ఉపాధి అవకాశాల సృష్టి, గ్రామీణ అభివృద్ధి, కళాకారుల ప్రోత్సాహంలో ఈ రంగం కీలకపాత్ర పోషిస్తుందని చెప్పారు. సామాజిక రుగ్మతలను రూపుమాపడంలో కూడా ప్రజాప్రతినిధుల పాత్ర ముఖ్యమని సూచించారు. (పజాకవి కాళోజీ నారాయణరావు చెప్పిన నా తెలంగాణ కోటి రత్నాల వీణ" అనే వాక్యాన్ని ఉటంకిస్తూ, రాష్ట్ర వారసత్వాన్ని ప్రపంచానికి చాటాలని మంత్రి ఆకాంక్షించారు.

తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలి

సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యమకారులు

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు డి. రామన్ గౌడ్

చిన్నంబావి, మార్చి 30 ప్రభాతవార్త: రాష్ట్రంలో తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకుని ఉద్యమకారులకు న్యాయం చేయాలని ఉద్యమకారుల ఫోరం జిల్లా నాయకులు డి. రామన్ గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ కొరకు రిలే దీక్షలు, రాస్తారోకోలు, సకల జనుల సమ్మె, ర్యాలీలు నిరసనలతో పలు ఉద్యమాలను నడిపిన చరిత్ర తెలంగాణ ఉద్యమకారులదనీ తొలి దశ, మలిదశ ఉద్యమాల్లో కుటుంబాలను కోల్పోయి పలు ఆర్థిక ఇబ్బందులతో ఉద్యమాలు నడిపించి ఉద్యమకారులకు పోలీస్ దెబ్బలు తిని పోలీస్ కేసులు, జైలుకెళ్ళి దెబ్బలు తిని గొంతు పోయేలా అరచి ఎన్నో అడ్డంకులు వచ్చినా తెలంగాణను సాధించుకోవాలనే సంకల్పంతో ఉద్యమాలను చేపట్టిన ఉద్యమకారులను తెలంగాణ వచ్చిన తర్వాత ఏ ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం నిండా నిరక్ష్యం నెలకొందని, తెలంగాణ ఉద్యమకారుల వనపర్తి జిల్లా కార్యదర్శి రామన్ గౌడ్, వనపర్తి జిల్లా నాయకులు పి.లక్ష్మీజి అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కమిటీ వేసి నిజమైన ఉద్యమకారుల గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలనీ, ఉద్యమకారుడికి 250 చదరపు గజాల స్థలం, 25 వేల రూపాయల పింఛన్ ఇవ్వాలన్నారు,తెలంగాణ ఉద్యమంలో పాల్గొని అమరులైన కుటుంబాలను ఆదుకోవాలన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు 10 లక్షల రూపాయల మెడికల్ సౌకర్యం కల్పించాలన్నారు. ఉద్యమకారుల ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి పదివేల కోట్ల రూపాయలతో ఉద్యమకారులను ఆదుకోవాలన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు ప్రతి ఒక్కరికి ఇంది రమ్మ ఇండ్లు కట్టించి ఇవ్వాలని, ప్రభుత్వం నుంచి వచ్చే సహాయ సహకారాలు తక్షణమే ఉద్యమకారులకు కల్పించాలని కోరారు. ఉద్యమకారులపై ఉన్న కేసులను అన్నివత్తివేయాలనీ,డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా నాయకులు నాయకులు రామన్ గౌడ్, లక్ష్మీజి,టి జేఏసీ నాయకులు పెరుమాళ్ళ శ్రీనివాసులు, పెరమాళ్ళ తిరుపతయ్య పాల్గొన్నారు.

కులాంతర వివాహాలకు ప్రోత్సాహం రూ.1.68 కోట్ల నిధులు విడుదల

నారాయణపేట, మార్చి 30 ప్రభాతవార్త : నారాయణపేట జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కులాంతర వివాహాలను ప్రోత్సహించే కార్యక్రమం కింద 2019,20నుండి 2025,26 వరకు తెలంగాణ ప్రభుత్వంరూ.1,68,31,000 నిధులను మంజూరు చేసినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఈ పథకం కింద మొత్తం 37 జంటలు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోగా, అందులో 19 జంటలకు మూడు సంవత్సరాల కాలపరిమితితో ఫిక్స్డ్ డిపాజిట్ రూపంలో వారి బ్యాంక్ ఖాతాల్లో నిధులు జమ చేసినట్లు వెల్లడించారు. మిగిలిన 18 జంటల దరఖాస్తులు ఫిక్స్డ్ డిపాజిట్ దశలో ఉన్నాయని తెలిపారు. ఇక ఎస్సీ/ఎస్టీఅత్యాచార బాధితుల కోసం మానిటరింగ్ రిలీఫ్ ఫండ్ కింద 2025,26సంవత్సరానికి గాను మొత్తం 35 మంది లబ్ధిదారులకు రూ.21 లక్షల నిధులు విడుదలయ్యాయి. అందులో 18 మందికి రూ.12,06,000 మంజూరు కాగా, మిగిలిన 17 మందికి రూ.8,95,000 మంజూరు దశలో ఉన్నట్లు పేర్కొన్నారు. జిల్లాకుఈ నిధులువిడుదల చేయడంలో సహకరించినశాఖ మంత్రి అడ్లూరిలక్ష్మణ్‌కుమార్, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క, ముఖ్యమంత్రికి అధికారులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ ఇసుక డంపులను సీజ్ చేసిన అధికారులు

అయిజ మార్చి, 30, ప్రభాతవార్త: మండల పరిధిలోని పులికల్ గ్రామ శివారులో అక్రమంగా నిలువ ఉంచిన ఇసుక డంపులను సోమవారం రెవెన్యూ మరియు పోలీస్ అధికారులు పరిశీలించి ఇసుక డంపులను సీజ్ చేశారు ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా తుంగభద్రా నది నుండి అక్రమంగా ఇసుక ఇసుకను తరలించి పులికల్ గ్రామ శివారులో డంపు చేసిన సమాచారం తమ దృష్టికి రావడంతో డంపులను గుర్తించి సీజ్ చేసినట్లు వారు తెలిపారు దాడుల్లో రెవిన్యూ అధికారి ఆర్ఐ రజనీకాంత్ రెడ్డి, మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

14 ఏళ్లు దాటిన బాలికలకు హెచ్‌పివి టీకాలు

నవాబుపేట, మార్చి30 ప్రభాతవార్త: 14000 దాటిన బాలికలకు హెచ్‌పివి టీకాలను సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా ఇచ్చారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక వ్యాక్సిన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా నవాబుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 14 ఏళ్ళు పైబడిన బాలికలకు ఉచితంగా హెచ్‌పివి ఇవ్వడం జరిగింది. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఈటీకాను తీసుకోవచ్చని మెడికల్ ఆఫీసర్ శ్రవణ్ కుమార్ తెలియజేశారు. టీకా తీసుకోవడం అనేది స్వచ్ఛందమే. దీనిని ఉచితంగా ఇస్తారు. సరైన వయసులో టీకా తీసుకుంటే భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బారినపడే ప్రమాదం నుంచి బయటపడొచ్చు అని వైద్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డా. శ్రవణ్ కుమార్‌తో పాటు ఎంపీడీవో జయరాంనాయక్, తహసిల్దార్ సువర్ణ, సర్పంచ్ గీతారాణి, ఐసిడిసి సూపర్‌వైజర్ ఆరోగ్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆశా వర్కర్ల ఆందోళన

- జాతీయ రహదారిపై బైఠాయింపు
- కిలోమీటర్ల మేరా ట్రాఫిక్ జామ్
- ఆరు నెలల పెండింగ్ జీతాలు చెల్లించాలంటూ డిమాండ్

జడ్చర్ల, మార్చి 30 ప్రభాతవార్త: జడ్చర్ల మండల కేంద్రం సమీపంలోని జాతీయ రహదారిపై ఆశా వర్కర్లు ఆందోళనకు దిగారు. ఆరు నెలల పెండింగ్ జీతాలు చెల్లించాలంటూ డిమాండ్ చేశారు. జడ్చర్ల సమీపంలోని కావేరమ్మపేట వద్ద ఎంబి మెడికల్ సెంటర్ ఎదురుగా సుమారు గంటపాటు జాతీయ రహదారిపై ధర్నా చేపట్టడంతో కిలోమీటర్ల మేరా ట్రాఫిక్ జామ్ అయింది. సీఎం డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆశా కార్యకర్తలను, సిఐటియు నాయకులను ఆందోళనకారులను చెదరగొట్టారు. అరెస్టు చేసి పోలీస్ స్టేషనుకు తరలించారు. దీంతో కొద్దిసేపు ఆశా వర్కర్లకు పోలీసులకు మధ్య వాగ్వాదం తోపులాట చోటు చేసుకున్నది.

రోడ్డుపై బైఠాయించిన ఆశాలు

ఘనంగా స్వామివారి రథోత్సవం

స్వామివారి రథాన్ని లాగుతున్న భక్తులు

దేవరకద్ర, మార్చి30 ప్రభాతవార్త: దేవరకద్ర పట్టణ ప్రజల ఆరాధ్య దైవమైన శ్రీ ఈశ్వర వీరప్పయ్య స్వామి సప్తవ మహోత్సవాలలో భాగంగా ప్రధాన ఘట్టమైన స్వామి వారి రథోత్సవం. సోమవారం తెల్లవారుజామున కన్నుల పండుగ జరుపుకున్నారు. ఈ సందర్భంగా దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో వెలసిన శ్రీ ఈశ్వర వీరప్పయ్య స్వామి మహోత్సవాల సందర్భంగా ఆలయ అర్చకులు ముందుగా స్వామి వారికి ప్రత్యేకపూజలు అభిషేకాలు అలంకరణ వంటి పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి విగ్రహాన్ని స్వామి వారి వ్రతంపై కూర్చోబెట్టి దేవాలయం నుంచి గ్రామ పుర వీధుల గుండా గోవిందా గోవిందా అంటూ ప్రత్యేక భజనలు చేస్తూ సన్నాయి మేళాల మధ్య భక్తులు ప్రజలు, మహిళలు యువకులు స్వామి వారి వ్రతాన్నితాడుతో లాగుతూ ఊరేగింపు చేశారు. అనంతరం భక్తులు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు. మరి కొంతమంది భక్తులు గండ దీపం,ఈ ప్రత్యేకపూజలను చేసి తమ కోరికలను కోరారు. అనంతరం భక్తులకు ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయచైర్మన్ నరసింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ కొండ దమయంతి గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ యుగంధర్‌రెడ్డి, పుట్టపల్లి తుమ్మల రాంరెడ్డి, పాలక మండలి సభ్యులు, భజన పరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దేవరకద్ర ఎమ్మెల్యేకు గజమాలతో సన్మానం

దేవరకద్ర,మార్చి 30 ప్రభాతవార్త: న్యాయవాదులు తమ విధులు నిర్వహించే సమయంలో వారిపై దాడులు బెదిరింపులు అవమానాలు జరగకుండా రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చే కొత్త చట్టం న్యాయవాదుల రక్షణ చట్టం. ఈ అంశంపై అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొందినందుకు బిల్లు ఆమోదానికి కృషిచేసిన దేవరకద్ర ఎమ్మెల్యే ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డిని సన్మానించి న్యాయవాదులు గజమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. టిపిసిసి అధ్యక్షులుమహేష్‌కుమార్‌గౌడ్,ముఖ్య న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు దేవరకద్రకు ఎమ్మెల్యే రాక

దేవరకద్ర, మార్చి30 ప్రభాతవార్త: నేడు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రానికి రానున్నారని దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 1:30 గంటలకు దేవరకద్ర మండల కేంద్రంలోని తాహసిల్దార్ కార్యాలయంవద్ద, మున్సిపాలిటీ కేంద్రానికి సంబంధించిన కళ్యాణ్ లక్ష్మి, షాదీ ముబారక్, సిఎంఆర్ చెక్కుల పంపిణీ కార్యక్రమం, మధ్యాహ్న 3:00 గంటలకు దేవరకద్ర మున్సిపాలిటీ జనరల్ బాడీ సమావేశంలో పాల్గొంటారని మండల అధ్యక్షులు అన్నారు. కార్యక్రమానికిమున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు, బీసీ,ఎస్సీ,మైనార్టీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, కార్యకర్తలు, ప్రతి ఒక్కరు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి అన్నారు.

డ్రగ్స్ ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన

దేవరకద్ర, మార్చి30 ప్రభాతవార్త: డ్రగ్స్, మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు భాగస్వాములు అవ్వాలని హైదరాబాద్ డిఎస్పీ రమేష్ అన్నారు. సోమవారం దేవరకద్ర మండలం వెంకటాయపల్లి గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో డ్రగ్స్, మాదకద్రవ్యాల పై విద్యార్థులకు అవగాహన సదస్సు కల్పించిన హైదరాబాద్ డిఎస్పీ రమేష్, దేవరకద్ర ఎస్సై నాగన్నలు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు బానిసలు అవ్వడం వల్ల యువత భవిష్యత్తు పూర్తిగా నాశనంఅవుతుందని హెచ్చరించారు. చదువుతోపాటు క్రీడలు సృజనాత్మక కార్యక్రమంలో పాల్గొంటూ, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లను డీఎస్పీ రమేష్, ఎస్ఐ నాగన్న, వెంకటాయపల్లి సర్పంచ్ రామాంజనేయులుతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

నేడు శ్రీశైలం డ్యాం ముట్టడి

- శ్రీశైలం కుడి జల విద్యుత్ ఉత్పత్తిని వెంటనే ఆపాలని డిమాండ్
- శ్రీశైలం డ్యాం ముట్టడికి కొల్లాపూర్ రైతులు, ప్రజలు

కొల్లాపూర్, మార్చి 30 ప్రభాతవార్త: శ్రీశైలం డ్యాం కుడి జలవిద్యుత్ కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అర్ధాంతరంగా జల విద్యుత్ ఉత్పత్తిని కొనసాగించడం ద్వారా కృష్ణా నది పరివాహక ప్రాంతంలో ఉన్న తెలంగాణ ప్రాంతంలోని రైతులకు, ప్రజలకు తాగు